బాలల హక్కులను కాపాడుదాం

ఎన్‌సీపీసీఆర్ కమిషన్ సభ్యురాలు పద్మావతి



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బాలబాలికల హక్కులను కాపాడుదామని ఎన్‌సీపీసీఆర్ కమిషన్ సభ్యురాలు పద్మావతి పిలుపునిచ్చారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో శుక్రవారం బాలల సమస్యలు, విద్యాహక్కు, పోక్సోచట్టం, బాలల హక్కుల చట్టంపై సమావేశం నిర్వహించారు. సభ్యురాలు పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్ కమిటీలు, ఫిర్యాదుల బాక్స్, ఈగల్‌క్లబ్స్, యాంటీ ర్యాగింగ్ కమిటీ, ప్రొటెక్షన్ కమిటీ, యువ, శక్తి కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అనాథ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. బనగానపల్లెలోని పాతబడిన బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌ను వారంలోపు అక్కడి నుంచి మార్చాలని ఆదేశించారు. పోక్సో బాధితులకు ఆసుపత్రిలో ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. బాల్యవివాహాల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనాథ పిల్లలు ఉంటే జిల్లాలోని బాలల సంరక్షణ విభాగానికి తెలియజేయాలని, పిల్లలకు నెలకు రూ.4 వేలు అందుతాయని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ యుగంధర్‌బాబు, డీఈవో జనార్దన్‌రెడ్డి, డీఐఈవో శంకర్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ లీలావతి, డీసీపీవో స్వప్న ప్రియదర్శిని, సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి, డిప్యూటీ డీఈవో శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

● బ్యాంకు అధికారులతో ఎస్పీ సమీక్ష




అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా బ్యాంకు అధికారులకు సూచించారు. బ్యాంకుల భద్రత ప్రమాణాలపై శుక్రవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ బ్యాంకుల్లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏటీఎం సెంటర్ వద్ద సెక్యూరిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగదు రవాణా సమయంలో శిక్షణ పొందిన, లైసెన్స్ పొందిన గార్డులను నియమించుకోవాలని సూచించారు. అన్ని బ్యాంకుల వద్ద అత్యవసర ఫోన్ నెంబర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఖాతాదారులు సైబర్ మోసాలకు గురికాకుండా అవగాహన కల్పించాలని సూచించారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్బీ సీఐ మోహన్‌రెడ్డి , వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

రుద్రవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికపై ఓ వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడగా అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. వివరాలు.. మండలంలోని మందలూరు గ్రామానికి చెందిన మైనర్ బాలిక గతనెల (జూలై) 31న టైలర్ వద్ద బట్టలు కుట్టడానికి ఇచ్చి ఇంటికి తిరిగి వెళ్తుంది. అదే గ్రామానికి ప్రభుకుమార్ అనే వ్యక్తి ఇంట్లోకి పిలిచి మైనర్‌పై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. శుక్రవారం బాలిక, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు ప్రభుకుమార్‌కు పదేళ్ల క్రితమే వివాహమైంది. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

జనన, మరణ పత్రాలు.. సీఎంరిలీఫ్ ఫండ్ నిధులు.. కారుణ్య నియామకాలు ఇలా ఎలాంటి పనులు కావాలన్న ఆర్డీవో కార్యాలయం నుంచి ధ్రువ పత్రాలు కావాల్సిందే. ఇవే కాదు ఇంకా చాలా పనులు ఆర్డీవో కార్యాలయంతో ముడిపడి ఉంటాయి. వీటిని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు అవినీతికి పాల్పడుతున్నారు. వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టారు. ప్రతి పనికి పైసలు వసూలు చేయడం ప్రారంభించారు. పనికో రేటు పెట్టుకొని బాధితులు, ప్రజల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. అవినీతికి అడ్డాగా ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం మారింది. విసిగి వేసారిన బాధితులు గురువారం ఏసీబీకి ఆశ్రయించగా అక్రమార్కుడిని ఏసీబీ వల వేసి పట్టుకుంది. దందా నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న ఓ అధికారికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



ప్రతి పనికి పైసా వసూల్

- అవినీతికి కేరాఫ్‌గా మారిన ఆర్డీవో కార్యాలయం
- పనులు కావాలంటే పైసలివ్వాల్సిందే..
- వసూళ్లు పర్వంలో ఆ ఇద్దరిదే కీలకపాత్ర
- సీఎం రిలీఫ్ ఫండ్, కారుణ్య నియామకాలను కూడా వదలని అక్రమార్కులు
- కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయిన బాధితులు

నందికొట్కూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆ కార్యాలయంలో ప్రతి పనికి పైసల్ వసూల్ చేస్తున్నారు. పైసలివ్వనిది అక్కడ ఏ పని కూడా కాదు. అవినీతికి అడ్డాగా ఆర్డీవో కార్యాలయం మారింది. ప్రతి పనికో రేటును విధించి రైతులను, బాధితులను పదేపదే తమ చుట్టూ తిప్పుకుంటున్నారనడానికి గురువారం జూపాడుబంగ్లా వద్ద ఏసీబీ వలలో సీనియర్ అసిస్టెంట్ రమేష్ చిక్కడమే ఇందుకు ఒక నిదర్శనం. డివిజన్‌తో పాటు ఆయా మండలాల్లో జనన, మరణ ధృవీకరణ పత్రాలను మొదలుకొని, భూముల మ్యుటేషన్, ఆర్‌వోఆర్‌లలో మార్పు, తహసీల్దార్ లేఖలు, రెగ్యులైజేషన్, ఫైనాన్స్ స్టేటస్ సర్టిఫికేషన్ ఇలా ఒక్కొక్క దానికి ఒక్కొక్క రేటును నిర్ణయించి వసూళ్లు చేస్తున్నట్లు పలు ఆరోపణలున్నాయి. ఫైనాన్స్ స్టేటస్ సర్టిఫికేషన్ కోసం రూ.30 వేలు వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. చివరకు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసు కున్న బాధితుల నుంచి కూడా డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఓ అధికారి నేరుగా తన ఫోన్‌పే నెంబర్‌ను బాధితులకు ఇచ్చి నగదును తీసుకుంటున్నారన్నది విశ్వసనీయ సమాచారం.



సీనియర్ అసిస్టెంట్ రమేష్ వద్ద లంచం డబ్బులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న, సిబ్బంది (ఫైల్)

అక్రమార్కులు విధించిన రేట్లు

- జనన మరణ ధ్రువీకరణ పత్రాలకు రూ.10వేల నుంచి రూ.20 వేలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. నో అర్నింగ్ మెంబర్ సర్టిఫికెట్ కోసం రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకు సమర్పించుకోవాల్సిందే. ల్యాండ్ కన్వర్షన్‌కు భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.
- ల్యాండ్ కన్వర్షన్‌కు భూమి మార్కెట్ విలువలో 2 శాతం నుంచి 5 శాతం వరకు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డివిజన్ కార్యాలయంలోని కొందరు అధికారులు, సిబ్బంది నందికొట్కూరు నియోజకవర్గం నుంచి వెళ్లిన పలు ఫైళ్లలో డబ్బులు డిమాండ్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- మిడ్తూరు మండలంలో ఓ పెట్రోల్ బంకును విజిట్ చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు. పగిడ్యాల మండలంలో ఓ గ్రామంలో పని చేస్తున్న వీఆర్వో గుండెపోటుతో మృతిచెందితే ఆయన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ఉద్యోగం ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్లు రెవెన్యూ వర్గాల ద్వారా సమాచారం.
- డివిజన్‌లోని ఓ మండల కార్యాలయంలో అటెండర్ మృతిచెందితే అతడి కుమారుడుకి ఉద్యోగం ఇవ్వడానికి రూ.50వేలు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. చేసేదేమి లేక డబ్బులు ఇచ్చి తెచ్చుకున్నట్లు వినికిడి.
- ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఓ ఉద్యోగి చనిపోతే అతడి కుమారునికి నో అర్నింగ్ మెంబర్ సర్టిఫికెట్ కోసం డబ్బులు డిమాండ్ చేసిట్లు తెలుస్తోంది. మిడ్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళా రైతుకు సంబంధించిన ఒక ఎకరా పొలాన్ని ఆమెకు తెలియకుండా ఆమె కుమారుడు తన పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత విషయం తెలుసుకున్న ఆమె కుమారుడి పేరును తొలగించి ఆమెపేరును తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవడానికి వెళ్లితే డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.

- మిగతా 4వ పేజీలో

పేదలను ఆదుకోవడంలో సంతృప్తి

- కలెక్టర్ రాజకుమారి
- ఒంటరి వృద్ధురాలి దత్తత



దత్తత తీసుకున్న తులశమ్మతో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు సాయంచేసి వారిని ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. పట్టణంలోని గోపాల్‌నగర్‌లో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో శుక్రవారం కలెక్టర్ పాల్గొని పలువురికి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా 15వ వార్డులో నివాసం ఉంటున్న ఒంటరి మహిళ తులశమ్మ కుటుంబ పరిస్థితిపై ఆరాతీసి కలెక్టర్ చలించిపోయారు. ఆమె కుటుంబాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. గతంలో చెంచుగూడెంలోని నెమలికుంటలో 29 బంగారు కుటుం బాలను దత్తత తీసుకున్నామని, నేడు తులశమ్మతో కలిపి 30కుటుంబాలు అవుతాయన్నారు. వారికి జీవనోపాధి, మౌలిక సదుపాయాలు కల్పించి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న పాల్గొన్నారు.

దేశభక్తి భావాలు పెంపొందించేలా..

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో దేశభక్తి భావాలు పెంపొందించేలా స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలను నిర్వహించేందుకు నిర్ణయించామని, ఆకర్షనీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని, ఆర్‌అండ్ బీ, ఉద్యానశాఖల అధికారులను ఆదేశించారు. జాతీయ పతాకావిష్కరణ, సాయుధ దళాల మార్చ్‌పాస్ట్, వేదిక, వీఐపీ సిట్టింగ్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక చొరవ చూపాలని ఆర్డీవో, పోలీసు అధికారులకు సూచించారు. దేశభక్తి ఉట్టిపడేలా మూడు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈవోను ఆదేశించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల జారీకి జాబితాను సిద్ధం చేయాలని డీఆర్వో రామునాయక్‌ను ఆదేశించారు.

ఆరుగాలం కష్టపడే అన్నదాతలకు కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎప్పుడెప్పుడా అని రెండు నెలలుగా ఎదురుచూస్తున్న 'అన్నదాత సుఖీభవ'కు మోక్షం లభించనుంది. శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశారు. 'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం పెద్దఎత్తున కసరత్తు చేసింది. ఏ ఒక్కరైతు నష్టపోకుండా అర్హులైన ప్రతి రైతుకు అందించేందుకు రెండు నెలలుగా శ్రమించి ఎంతో పకడ్బందీగా రైతుల జాబితాను సిద్ధం చేసింది. తొలి విడత జిల్లాలోని 2,07,541 మంది రైతులకు రూ.140.57 కోట్లను రైతులకు అందించనున్నారు.



అన్నదాతకు అండగా..

- మొదటి విడతగా రూ.140.57 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- జిల్లావ్యాప్తంగా 2.06లక్షలు మందికి లబ్ధి
- లబ్ధిదారుల్లో ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూరు ప్రాంత రైతులే అధికం
- నేడు ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

'అన్నదాత సుఖీభవ' అమలు

నంద్యాల, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరియనుంది. ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది. అందులో అత్యంత కీలకమైన అన్నదాత సుఖీభవ పథకం ఆచరణలోకి రానుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకాన్ని కలుపుకుని రాష్ట్రప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంతో అనుసంధానించి శనివారం తొలివిడత జిల్లాలోని 2,07,541 మంది రైతులకు రూ.140.57కోట్లను రైతులకు అందించనున్నారు. ఒక్కొక్క రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14000, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు చొప్పున మొత్తంగా రూ.20వేలు పెట్టుబడి సాయం కింద మూడు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో తాజాగా రెండు పథకాల కింద కలిపి ఒక్కొక్క రైతుకు మొదటి విడత కింద రూ.7వేలు అందించనున్నారు. జిల్లాలో పెద్దఎత్తున పేద రైతులకు పెట్టుబడి లబ్ధి చేకూరడంతో పాటు రైతులకు ప్రభుత్వం అండగా నిలిచినట్లైంది. ఇదే క్రమంలో సదరు రైతుల్లో ఆనందోత్సవం మొదలైంది. ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు ప్రారంభించనున్నారు.



గత వైసీపీ హయాంలో

గత వైసీపీ హయాంలో రైతు భరోసా కింద ఏడాదికి రూ.7500, పీఎం కిసాన్ రూ. 6 వేలు కలిసి మొత్తంగా రూ.13,500 మాత్రమే అందించారు. కూటమి ప్రభుత్వం మాత్రం.. అన్నదాత సుఖీభవ కింద రూ.14,000, పీఎం కిసాన్ కింద రూ. 6వేలు చొప్పున మొత్తంగా ఏడాదికి రైతుకు రూ.20వేలు అందించేలా చర్యలు తీసుకుంది. దీంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరియనుంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

- జిల్లాలో అన్నదాత సుఖీభవ అందే రైతుల సంఖ్య: 2,06,052 మంది
- పీఎం కిసాన్ అందే రైతుల సంఖ్య : 1,87,733మంది
- రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందించే నిధులు: 103.03 కోట్లు
- కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద అందించే నిధులు : రూ.37.55 కోట్లు
- రెండు పథకాల కింద జిల్లాలో రైతులకు అందే నగదు : రూ. 140.57 కోట్లు

జిల్లాలో నియోజకవర్గాల వారిగా..

నియోజకవర్గం	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్
నంద్యాల	12,953	12,013
నందికొట్కూరు	36,734	33,867
శ్రీశైలం	25,018	23,407
డోన్	35,018	31,749
పాణ్యం	12,691	12,399
ఆళ్లగడ్డ	42,981	39,736
బనగానపల్లె	40,664	34,562
మొత్తం	2,06,052	1,87,733

జిల్లాలో రూ.140.57 కోట్లు..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్ కింద జిల్లాలో 1,87,733మంది రైతులు.. అన్నదాత సుఖీభవ కింద 2,06,052 మంది రైతులు అర్హులుగా జిల్లా యంత్రాంగం గుర్తించారు. వీరందరికి నేడు రూ. 140.57 కోట్ల నగదు ఆయా రైతుల ఖాతాల్లో జమ కానుంది. ఇందులో అత్యాధికంగా ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూరు నియోజక వర్గాల్లో రైతులు ఈ పథకాలకు అర్హత పొందినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి.

కౌలు రైతులకు అక్టోబరులో..

రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారు. కేంద్రం మాత్రం పీఎం కిసాన్ వీరికి ప్రకటించలేదు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాట ప్రకారం.. మాట తప్పకుండా కౌలురైతులకు కూడా ఈఏడాది అక్టోబరు నెలలో అన్నదాత సుఖీభవ నిధులు మంజూరు చేసి అర్హులైన కౌలు రైతుల అకౌంట్‌లో జమ చేయనుంది.



రైతులకు ఎంతో ఉపయోగం

అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ పథకాల కింద అర్హులైన రైతులకు జిల్లా వ్యాప్తంగా రూ.140.57కోట్లు ఆయా రైతుల ఖాతాల్లో జమ కానుంది. ప్రభుత్వాలు అందించే ఈ సాయం రైతులకు ఎంతో ఉపయోగకరం.

- జిల్లా వ్యవసాయాధికారి, వెంకటేశ్వర్లు, నంద్యాల





శ్రావణం.. వ్రతాల మాసం

- పర్వదినాల సమాహారం
- వ్రతాలు, పూజలకు ప్రత్యేకం



కొలిమిగుండ్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): హిందువులకు అత్యంత పవిత్రమైన పర్వదినాల సమాహారం శ్రావణ మాసం. శ్రావణమాసం వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లోనూ వ్రతాలకు శ్రీకారం చుడతారు. మంగళగౌరిని పూజించి, వరలక్ష్మీదేవిని అర్చించి తమ సౌభాగ్యాన్ని కలకాలం నిలుపుకోవాలని ముత్తయిదువులకు ఘనంగా నోములు చేస్తారు. ఒక్క శ్రావణమాసంలోనే ఇలాంటి గొప్ప ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. ఎన్నో ఆధ్యాత్మిక పూజలు, నోములు, వ్రతాల నిర్వహణకు ఈ మాసం అనుకూలంగా ఉంటుంది.

శ్రావణమాసం ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా హైందవ సమాజంలో సందడి నెలకొంది. ఆలయాలు నూతన శోభను సంతరించుకోగా, వివాహాలు, వివిధ రకాల శుభకార్యాలు జోరందుకున్నాయి. శ్రీమహా విష్ణువు జన్మ నక్షత్రం శ్రవణం. ఆపేరుతో వచ్చే మాసం కావడంతో మహాలక్ష్మీకి ఎంతో ఇష్టమైన మాసం. ఈమాసంలో లక్ష్మీదేవిని పూజిస్తే సిరి సంపదలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని మహిళలకు అపారనమ్మకం. మానవులే కాక సకల దేవతలు కూడా మహాలక్ష్మీని పూజించి అనుగ్రహం పొందారని మన పురణగాథలు చెబుతున్నాయి. ఈ మాసంలో వరలక్ష్మీ వ్రతాలు, మంగళగౌరీ నోములు అత్యంత పవిత్రతో నిర్వహిస్తారు.

వరుస ముహూర్తాలు: హిందువులకు అత్యంత పవిత్రమైన శ్రావణమాసం వివాహాది శుభకార్యాలకు వేదికగా మారుతుంది. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు ఇలా అనేక శుభకార్యాలను అధికంగా జరుపుకుంటారు. ఆగస్టు 1న ప్రారంభమైన శుభముహూర్తాలు 2, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 వరకు వరుసగా శుభ ముహూర్తాలు ఉన్నట్లు వేద పండితులు వెల్లడిస్తున్నారు.

16న శ్రీకృష్ణాష్టమి : ఈ మాసంలో మరో అత్యంత పవిత్రమైన పర్వదినం శ్రీకృష్ణాష్టమి. హిందువుల ఆరాధ్యదైవంగా భావించే శ్రీకృష్ణుడు శ్రావణమాసంలో జన్మించాడని హిందువుల అపార నమ్మకం. ఈసందర్భంగా శ్రీకృష్ణుడి ప్రతిమల ఊరేగింపు, చిన్నారులకు శ్రీకృష్ణ వేషాధారణలు, ఉట్టి కొట్టు కార్యక్రమాలు, గ్రామోత్సవాలతో పెద్ద ఎత్తున భక్తి భావం ఉప్పొంగుతుంది.

8న వరలక్ష్మీ వ్రతం : శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం కావడంతో అత్యంత పవిత్రంగా భావించి, వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తారు. అత్యంత నియమ నిష్టలతో ఇళ్లలోనూ, ఆలయాల్లోనూ వరలక్ష్మీ వ్రతాలను పాటిస్తారు.



9న రాఖీ పౌర్ణమి : రాఖీ పౌర్ణమి రోజునే హయగ్రీవ జయంతి వేడుకలను జరుపుకుంటారు. తోబుట్టువుల మధ్య అనుబంధానికి ప్రతీకగా ఈ పర్వదిన్నాన్ని జరుపుకుంటారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచకంగా రక్షా భంధన్ కట్టి వేడుకలు చేస్తారు. ఇలా శ్రావణ మాసంలోని ప్రతి రోజునూ అత్యంత పవిత్రంగా భావించి, హిందువులు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు.



ప్రతి పనికి పైసా వసూల్



3వ పేజీ తరువాయి

- ఒక వ్యక్తి మృతి చెందితే అతని కుమారులు మరణ ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్యాలయంలో ఓ అధికారి రూ.50 వేలు ఇస్తేనే చేస్తానని చెప్పడంతో... చేసేదేమి లేక రూ.40 వేలు నగదు ఇచ్చి ధ్రువపత్రం తీసుకున్నారు.
- పొలాల కొలతలకు రైతులు కాళ్లరిగేలా తిరిగినా పనులు కావడం లేదు. ముందుగా చేతులు తడిపిన వారికి మాత్రమే పనులు జరుగుతున్నాయి. ఎకరానికి రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారు. కొందరు మండల సర్వేయర్లు ప్రైవేటు సర్వేయర్లను పంపించి వసూళ్లకు పాల్పడుతున్నారు.

ఇద్దరు వ్యక్తుల ఆధ్వర్యంలోనే దందా..

ఆ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తుల ఆధ్వర్యంలో ఈ తతంగమంతా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నందికొట్కూరు మండలంలో ఓగ్రామానికి వీఆర్వోగా పనిచేస్తున్న వ్యక్తిని వసూళ్ల దందా కొనసాగించేందుకు తనను రిలీవ్ చేయకుండా అక్కడే నియమించుకొన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతఏడాది నుంచి కార్యాలయంలో జరిగిన మ్యుటేషన్లు, ఆర్వోఆర్ కేసులు, జనన మరణ ధృవీకరణ, ల్యాండ్ కన్వర్షన్ వివరాలను పరిశీలిస్తే కార్యాలయంలో జరిగిన అవినీతి బట్టబయలు అయ్యే అవకాశం ఉన్నట్లు పలువురు చర్చించకుంటున్నారు. దందా నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న ఓ అధికారికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బళ్లారిలో దాదాపు 5 ఎకరాల పొలం, జూపాడుబంగ్లాలో 20ఎకరాలు భూమి, కర్నూలులో రెండు అపార్టుమెంట్లు, ఒక విల్లాతో పాటు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏపీ బ్రాండ్ ఇమేజ్ రెట్టింపు

- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ సంస్థల ఆసక్తి
- అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌తో సింగపూర్ పర్యటన మరువలేని అనుభూతి
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్



ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఐదు రోజులు సింగపూర్ అధికారిక పర్యటన మరువలేని అనుభూతిని ఇచ్చింది.

కర్నూలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ అంటే ఒక బ్రాండ్. అలాంటి ఇమేజ్‌ను గత వైసీపీ ప్రభుత్వ సర్వనాశం చేసింది. మళ్లీ ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. సీఎం చంద్రబాబును చూసి దిగ్గజ సంస్థలు ఏపీ వైపు చూస్తున్నాయి. దీంతో ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెరిగింది..' అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణలతో కలసి ఐదు రోజుల సింగపూర్ పర్యటన ముగించుకుని గురువారం రాత్రి ఆయన కర్నూలుకు చేరుకున్నారు. సింగపూర్‌లో అధికారిక పర్యటన విశేషాలను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలియజేశారు. 2014-19 మధ్య కాలంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ దిగ్గజ సంస్థలు ముందుకు వచ్చాయి. కార్యరూపం దాల్చాల్సిన సమయంలో వైసీపీ ప్రభుత్వం రావడం, జగన్ విధానాలతో ఏపీ బ్రాండ్ ఇమేజ్ సర్వనాశనం చేయడంతో వెనక్కి తగ్గడమే కాకుండా, ఏపీలో పెట్టుబడులు పెట్టకూడదని ఆ దేశం నిర్ణయం తీసుకుందని తెలిపారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో తమ బృందం ఐదు రోజుల పర్యటనతో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు ఆత్మవిశ్వాసం పెరిగిందని, దగ్గజ సంస్థలు ముందుకు వస్తున్నాయని వివరించారు.

వరుస భేటీలు.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు

సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్న సహా ఆ దేశ మంత్రులు, ప్రభుత్వాధినేతలు, ఉన్నతాధికారులు, దిగ్గజ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్లతో పవర్ పాయింట్ ప్రజంటేషన్లతో రాష్ట్రంలో అపార వనరులు, వ్యాపార, పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలును సీఎం చంద్రబాబు వివరించారు. పెట్టుబడులతో వచ్చి ఏపీ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని చంద్రబాబు పిలుపుతో పలు దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపాయి. 25-30 వరకు సమావేశాలు, సింగపూర్ ప్రభుత్వాధినేతలో ఆరు హైలెవల్ భేటీలు, మూడు రౌండ్ టేబుల్ సమావేశాలు, స్పోర్ట్స్ సిటీ, పెట్రోకెమికల్ యూనిట్, పోర్టును క్షేత్రస్థాయి పరిశీలన చేశాం. సింగపూర్ హౌసింగ్ నిర్మాణాలను పరిశీలించాం. సీఎం చంద్రబాబు,

ఏపీపై ఆత్మవిశ్వాసం



సీఎం చంద్రబాబు, లోకేశ్‌తో కలసి సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగ తర్నంతో మంత్రి టీజీ భరత్

సింగపూర్ పర్యటనతో భాగంగా సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, నారాయణలతో కలసి ఆదేశ అధ్యక్షుడు థర్మన్ షణ్ము గరత్నంతో భేటీ, ఆదేశ మంత్రి టాన్ సీ లెంగ్‌తో సమావేశమయ్యాం. సింగపూర్ దిగ్గజ సంస్థల సీఈవోలతో ప్రత్యేక సమావేశం సీఎం చంద్రబాబు నిర్వహించారు. సింగపూర్‌లోని జురాంగ్ పెట్రోకెమికల్ ఐలాండ్‌లో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో అధినేత చంద్రబాబుతో కలసి హాజరయ్యాను. సమావేశం ఏదైనా, భేటీ ఎవరితో నిర్వహించినా ఏపీ పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్రం సుదీర్ఘ సముద్రతీరం అభివృద్ధికి ముఖద్వారం కావడంతో పోర్టులు, వాటి ఆధారిత పరిశ్రమలు, షిప్‌యార్డులు, పర్యటక కేంద్రాల అభివృద్ధికి అవకాశాలపై వివిధ కంపెనీల సీఈవోల సమావేశంలో చంద్రబాబు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు వారు ఫిదా అయ్యారు. ఏపీపై ఆత్మవిశ్వాసం పెరిగిందని, పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. వారితో నిత్యం ఫాలోఅప్ చేస్తూ పెట్టుబడులు రాబట్టేందుకు పరిశ్రమల మంత్రిగా నా వంతు కృషి చేస్తా.

ఈ పర్యటన ఓ సిలబస్

యువ పారిశ్రామికవేత్తగా పలు దేశాల్లో పర్యటించిన అనుభవం ఉన్నా, సీఎం చంద్రబాబు, మంత్రులతో కలసి ఓ మంత్రిగా సింగపూర్ పర్యటన నాకు ఓ సిలబస్‌గా మారింది. ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఆ దేశ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాని, ప్రస్తుత మంత్రి లీ సైన్ లూంగ్, గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ సీఈవో బ్రాన్‌యే, విల్మర్ ఇంటర్నేషనల్ సంస్థ అధిపతి రాహూల్, ఏఐ సింగపూర్ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మోహన్ కంకణవల్లి తదితరులతో సీఎం చందబాబు నిర్వహించిన వరుసల భేటీలు, గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బ్రైస్‌తో ఐటీ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్నా. ఇవే కాదు.. ఐదు రోజుల పర్యటనలో సింగపూర్‌లోని జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్‌ను చంద్రబాబుతో కలసి పరిశీలించాం. ఆంధ్రా-సింగపూర్ బిజినెస్ ఫోరం భేటీలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా.



సింగపూర్ ఎనర్జీ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్ సీ లెంగ్‌తో సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, నారాయణతో కలసి టీజీ భరత్

దున్నేస్తున్నారు..



తర్తూరు గ్రామ పొలిమేరలో మొక్కజొన్న పైరును దున్నేస్తున్న రైతు ఖాజా

అడపాదడపా కురిసిన వర్షానికి బోరుబావులు, మెట్టప్రాంతాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట ఎండుముఖం పట్టింది. పంట సాగుచేసి 50రోజుల్లో వర్షాలు కురవపోవడంతో పైర్లు ఎండుముఖం పట్టడంతో రైతులు పైరు బతికించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. 15రోజుల క్రితం తంగడంచ గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి మొక్కజొన్న పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎకరాకు రూ.20వేల చొప్పున కౌలుకు తీసుకుని పెట్టుబడి ఖర్చు ఎకరాకు రూ.10వేలు ఖర్చుపెట్టి పంట కళ్లముందే వర్షంలేక, బోర్లలో నీరులేక ఎండి పోతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం మండలంలోని తర్తూరు గ్రామానికి చెందిన కౌలు రైతు ఖాజా ఐదెకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న ఎండుముఖం పట్టడంతో ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నేశారు.

- జూపాడుబంగ్లా (ఆంధ్రజ్యోతి)

అమ్మ పేరుతో ఒక మొక్క

కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు యశోదాబాయి



మొక్క నాటుతున్న కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు యశోదాబాయి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు యశోదాబాయి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం, సంచార దళ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజు వారీ విధులు, వార్షిక లక్ష్యాలు, రూపొందించిన ప్రణాళికలు, వాటి అమలు తదితర వాటిపై ఆరా తీశారు. అనంతరం యశోదాబాయి మాట్లాడుతూ జిల్లాలో పచ్చదనాన్ని మరింత వృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 4.80 లక్షల మొక్కలను నాటేందుకు సిద్ధంగా ఉంచామని, ఆసక్తి కలిగిన వారు వాటిని ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపులో భాగస్వాములు కావాలని, తల్లి పేరుతో మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని తెలిపారు. మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో పి.శ్యామల, ఎఫ్ఆర్‌వో విజయ్‌కుమార్, తేజస్విని, రమణారెడ్డి, లక్ష్మయ్య, ఓబులేసు, రేణుక పాల్గొన్నారు.

తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అవార్డులు రావడం సంతోషదాయకం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కర్నూలు కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 71వ జాతీయ చలన చిత్ర అవార్డులు తెలుగు సినీ పరిశ్రమకు రావడం చాలా సంతోషంగా ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీ తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఫౌండర్ ఛైర్మన్ టీజీ వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ తెలుగు చిత్రంగా 'భగవత్ కేసరి' చిత్రానికి జాతీయ అవార్డు దక్కడం పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జాతీయ ఉత్తమ స్క్రీన్‌ప్లే రైటర్‌గా, బెస్ట్ స్టంట్ డైరెక్టర్‌గా 'హనుమాన్' చిత్రం, అలాగే 'బలగం', 'బేబీ' చిత్రాలకు ఉత్తమ గేయం, ఉత్తమ గాయకుడు అవార్డులు, ఉత్తమ బాలనటిగా సుకృతి వేణి (దర్శకుడు సుకుమార్ సుపుత్రిక) 'గాంధీతాత చెట్టు' అనే చిత్రం ద్వారా ఉత్తమ బాలనటిగా ఎంపిక అవడం అభినందనీయమని తెలిపారు. అలాగే 71వ జాతీయ చలనచిత్ర అవార్డులు గెలుచుకున్న నటీనటులకు, రచయితలకు, సాంకేతిక నిపుణులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామని టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు.

అంధులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

- బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి
- 16 ఏళ్లుగా సొంత నిధులతో పింఛన్లు



అంధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కోరారు. తన తల్లిదండ్రులు బీసీ గురెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం ఆయన శుక్రవారం అంధులకు స్థానిక సొంత నిధులతో పింఛన్లను అందజేశారు. 16 సంవత్సరాలుగా అంధులు, నిరాశ్రయులకు ఆయన రూ.500 చొప్పున ప్రతి నెలా 160 మందికి సొంత డబ్బులతో పింఛన్లను అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన అంధులు, నిరాశ్రయులకు క్రమం తప్పకుండా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అంధులు మానసిక ఒత్తిడికి గురికాకుండా మనోధైర్యంతో ముందుకు వెళ్ళాలన్నారు. నేటి ఆధునిక యుగంలో ఎంతోమంది యువత వైకల్యాన్ని జయించి ఐఏఎస్ ఉద్యోగాలతో పాటు పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్నారన్నారు. అంధులు కూడా మనోధైర్యం కోల్పోకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు నెల నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా మరికొంతమంది అంధులను గుర్తించి వారికి పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వందశాతం అంధులుగా ఉన్న వారు ఎవరైనా ఉంటే 94417 61780 సెల్ నంబర్‌ను సంప్రదించాలని బీసీ రాజారెడ్డి కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రెగ్యులర్ సర్వీసు ఉండి, ఎలాంటి నేర ఆరోపణలు ఉండరాదన్నారు. ప్రతిపాదనలతో పాటు నేరారోపణలు కేసులు లేవని ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు. గతంలో అవార్డు పొందిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులన్నారు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

జిల్లా స్థాయి గేమ్స్ సెక్రటరీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గానూ జిల్లా స్థాయి గేమ్స్ సెక్రటరీ పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామక ప్రక్రియ మెరిట్ ఆధారంగా కొనసాగుతుందన్నారు. ఆసక్తి, అర్హత గల వ్యాయామ ఉపాధ్యాయులు, మండల, ఉప విద్యాశాఖ అధికారుల ద్వారా ఈ నెల 4వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

పాలిటెక్నిక్ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బి.తాండ్రపాడు పుల్లారెడ్డి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో బయో మెడికల్ ఇంజనీరింగ్ అప్లయిడ్ ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మిగిలిన సీట్లకోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. పాలిసెట్ రాసినా, రాయని విద్యార్థులు కూడా హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 5న ఉదయం 11 గంటలకు విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు పది, టీసీ, స్టడీ, ఆదాయ, కుల సర్టిఫికెట్లు, పాలిసెట్ ర్యాంక్ కార్డు రెండు ఫొటోస్టాట్ సెట్లతో హాజరు కావాలన్నారు

హంద్రీనీవా ద్వారా చెరువులకు
పూర్తిస్థాయిలో నీరు: ఎమ్మెల్యే



పందికోన రిజర్వాయర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పత్తికొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ద్వారా 68 చెరువులతోపాటు మిగిలిన ట్యాంకులకు నీరు అందిస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ రంజిత్‌బాషాతో కలసి ఎమ్మెల్యే పత్తికొండ మండలంలో పర్యటించారు. కనకదిన్నె వద్ద నిర్మాణంలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతంచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. దూదెకొండ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. అక్కడ 6వ తరగతిలో పాఠ్యాంశాలపై కలెక్టర్ విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. మధ్యాహ్న భోజనానికి కట్టెల పొయ్యి వాడకూడదని, గ్యాస్‌ని వినియోగించాలని ఆదేశించారు. అనంతరం పందికోన రిజర్వాయర్ కుడికాలువ రెగ్యులేటర్‌ను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన వార్డులలో తిరుగుతూ ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ పందికోన రిజర్వాయర్ స్లూయిస్, రివిట్‌మెంట్‌తోపాటు పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు రూ.250 కోట్లు అవసరం అవుతాయన్నారు. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. ఆ పనులు పూర్తయితే ప్రస్తుతం కుడి, ఎడమ కాలువలద్వారా అందించాలనుకున్న 68వేల ఎకరాలతోపాటు మరో 40వేల ఎకరాలకు అదనంగా సాగునీరు ఇచ్చే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, ఎంపీడీఓ కవిత, వైద్యాధికారి కల్పన, నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, వెంకటపతి, కడవల సుధాకర్, తిరుమలేష్‌గౌడ్, పరమేష్‌నాయుడు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు, డోన్‌లో రైల్వే జీఎం ఆకస్మిక పర్యటన

● అభివృద్ధి పనుల పరిశీలన



కర్నూలు రైల్వేస్టేషన్ అభివృద్ధి ప్లాన్‌ను పరిశీలిస్తున్న జనరల్ మేనేజర్ సంజయ్‌కుమర్ శ్రీవాత్సవ

కర్నూలు రూరల్/ డోన్‌రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు, డోన్ రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం సికింద్రాబాద్ నుంచి హైదరాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ లోకేశ్ విష్ణోయ్‌తో కలిసి ఆయన ప్రత్యేక రైలులో బయలుదేరి నేరుగా డోన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. డోన్ రైల్వేస్టేషన్ పరిశీలించి అక్కడి నుంచి కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌కు ఉదయం 9గంటలకు చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ కింద జరుగుతున్న పలు రైల్వే అభివృద్ధి పనులను జనరల్ మేనేజర్ పరిశీలించారు. వెంకటరమణ కాలనీ వైపు ఎంట్రీగేట్, అటువైపు నుంచి స్టేషన్ ముఖద్వారం దాకా బ్రిడ్జి, స్టేషన్ ముఖద్వారం ఆవరణలో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కర్నూలు రైల్వేస్టేషన్ నుంచి కర్నూలు మండలం పంచలింగాల గ్రామ శివారులో జరుగుతున్న రైల్వేవర్క్‌షాపునకు వెళ్లి పనులను పరిశీలించారు. అక్కడి నుంచి జోగుళాంబ రైల్వేస్టేషన్‌కు బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట రైల్వే జీఎం టు సెక్రటరి శ్రీనివాస్ మల్లాడి, రైల్వే చీఫ్ ఇంజనీర్ నాగభూషణం, సాంబశివరావు, డివిజన్ స్థాయి అధికారులు, కర్నూలుసిటి రైల్వేస్టేషన్ శేషఫణి, సీసీఐ మున్నాజీరావు తదితరులు ఉన్నారు.

మహిళల రక్షణే ధ్యేయం

- మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఉపేంద్రబాబు

కర్నూలు క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణే ధ్యేయంగా పనిచేస్తామని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు వెల్లడించారు. శుక్రవారం ఆయన కర్నూలు నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మిగనూరు డీఎస్పీగా పని చేస్తున్న ఈయన ఇటీవల జరిగిన బదిలీల్లో కర్నూలుకు వచ్చారు.



ఎస్పీని కలిసిన నూతన డీఎస్పీ ఉపేంద్రబాబు

ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ కె.శ్రీనివాసాచారి గుంతకల్లు రైల్వేకి బదిలీ అయ్యారు. డీఎస్పీ ఉపేంద్రబాబు స్వస్థలం అనంతపురం పట్టణం. 1995 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. ఆళ్లగడ్డ, ఆత్మకూరు, పాణ్యం, నంద్యాల ట్రాఫిక్, దొర్నిపాడు, ప్యాపిలి, ఉలిందకొండ, హొళగుంద పోలీస్ స్టేషన్లలో పని చేశారు. సీఐగా అనంతపురం పీటీసీకి, కర్నూలు వన్‌టౌన్‌లో, సీఐడీలో 7 సంవత్సరాలు, సీసీఎస్‌లో 4 సంవత్సరాలు పని చేశారు. అలాగే డీఎస్పీగా అనకాపల్లిలో, ఎమ్మిగనూరులో పని చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. శక్తియాప్, శక్తి వాట్సాప్ గురించి మహిళా చట్టాలపై కళాశాలలో, పాఠశాలల్లో మహిళల భద్రతే లక్ష్యంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బాలుడిని రక్షించారు

● తల్లి మందలించిందన్న మనస్తాపంతో నదిలో దూకే ప్రయత్నం

● అడ్డుకొని ఎస్ఐకి అప్పగించిన ప్రజలు

బండిఆత్మకూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు వచ్చిన బాలుడిని ప్రజలు కాపాడారు. వివరాలివీ.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. విద్యార్థి తండ్రి లేరు. బడికి వెళ్లాలని విద్యార్థి తల్లి సూచించింది. అయితే ఇంటి నుంచి బడికి అని వచ్చి సంతజూటూరు పికప్ ఆనకట్ట వద్ద నదిలో దూకాలనే ప్రయత్నంలో ఉండగా విచారించి చేపల వేటగాళ్లు, కూలీలు, ప్రజలు అబ్బాయిని పట్టుకుని ఎస్ఐ జగన్మోహన్‌కు సమాచారం ఇచ్చి, అనంతరం ఎస్ఐకి బద్రికి అప్పగించారు. విచారించి తల్లికి అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.



ఎస్ఐకి బాలుడిని అప్పగిస్తున్న ప్రజలు

పట్టుపట్టి... కొలువు కొట్టి..!

● కానిస్టేబుల్ ఫలితాలు విడుదల ● ఉమ్మడి జిల్లాలో 281 మంది ఎంపిక

కర్నూలు క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షల ఫలితాలు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 285 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. 2022 జనవరి 22న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల్లో 281 మంది అభ్యర్థులు సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. ఒక్క గోనెగండ్ల మండలంలోనే 16 మంది అభ్యర్థులు, కోసిగిలో 14 మంది అభ్యర్థులు అత్యధికంగా ఈ పోస్టులకు ఎంపిక కావడం విశేషం. అలాగే కర్నూలు డయల్ 100 విభాగంలో పని చేస్తున్న ఇద్దరు హోంగార్డులు బాలకృష్ణ, మస్తాన్, మహేంద్ర సివిల్ కానిస్టేబుల్స్‌కు ఎంపికయ్యారు. కర్నూలు జిల్లాలో కోసిగికి చెందిన దుర్నిగేని శ్రీరాములు 159 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. అదేవిధంగా రవికుమార్ 151 మార్కులు, గోవిందు 145, లిఖిత 141 మార్కులు, నాయక్ 137 మార్కులు, విజయ్ 140 మార్కులు సాధించారు.

గోనెగండ్ల నుంచి 16 మంది ఎంపిక

● ఒకే ఇంట్లో అన్నదమ్ములకు ఉద్యోగం

గోనెగండ్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం శుక్రవారం ఉదయం పోలీస్‌కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేసింది. అందులో గోనెగండ్ల మండలంలోని గోనెగండ్ల, ఐరన్‌బండ గ్రామాలకు చెందిన 16 మంది యువకులు ఏపీఎస్‌పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అందులో గోనెగండ్లలో అచ్చుకట్ల వీధిలోని రిటైర్డ్ ఎస్ఐ షరీఫ్‌సాహెబ్ కుమారులు హుసేన్‌వలి, హసన్‌వలి ఇద్దరు ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. తన తండ్రి షరీఫ్ ఎస్ఐ చేసిన సేవలను వారు గుర్తు చేసుకొని వారి స్ఫూర్తితో పనిచేస్తామన్నారు. అలాగే గోనెగండ్లకు చెందిన దరగల రఫీ, దరగల చాంద్, ఇమామ్‌బాషా, అచ్చుకట్ల ఉసేన్, మన్సూర్, జావీద్, సాదిక్, ఫారుక్, యూనుష్, నరసింహులు, మారేశ్, ఐరన్‌బండ గ్రామానికి చెందిన షేక్‌మాబువలి, సిద్దపోగు ఏసేపు, శివ ఎంపికయ్యారు. గోనెగండ్లలో 13 మందికి ఐరన్‌బండలో ముగ్గురికి ఏపీఎస్పీకి ఎంపిక కావడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అన్నదమ్ములు

పోలీస్ స్టేషన్ ఎదుట కొత్తిమీర విక్రయించే మహిళ కుమారుడు పోలీస్ అయ్యాడు..

పత్తికొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణకోసం పత్తికొండ పోలీస్ స్టేషన్ ఎదుట కొత్తిమీర విక్రయించే మహిళ లక్ష్మీదేవి, కౌలుట్లయ్య కుమారుడు పోలీస్ కొలువు సాధించాడు. శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో వారి కుమారుడు శివ చిత్తూరు బెటాలియన్ ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన కౌలుట్లయ్య, లక్ష్మీదేవి దంపతులు పత్తికొండ పోలీస్‌స్టేషన్ పక్కన కొత్తిమీర వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నిత్యం పోలీసులను చూస్తూ ఉండే లక్ష్మీదేవికి తన కుమారుడిని కూడా అలా ఖాకీ దుస్తుల్లో చూడాలని అనుకునేది. ఎట్టకేలకు తల్లి కలను నెరవేర్చాడు శివ.



కోసిగి యువకుల సత్తా



శ్రీరాములు

● మండలం నుంచి 16 మంది ఎంపిక

● జిల్లా టాపర్‌గా దుర్నిగేని శ్రీరాములు

కోసిగి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం విడుదలైన పోలీస్ కానిస్టేబుళ్ల ఫలితాల్లో కోసిగి మండలం నుంచి 16 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికై సత్తాచాటారు. కోసిగిలోని 6వ వార్డు చెందిన దుర్నిగేని శ్రీరాములు 159 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకులో సివిల్ పోలీస్‌గా ఎంపికయ్యాడు. అదే వార్డుకు చెందిన నిరుపేద దినసరి కూలీ నాడిగేని కోసిగయ్య, ఈరమ్మ దంపతుల కుమారుడు నాడిగేని బోయ హనుమంతరెడ్డి 139 మార్కులతో ఎంపికయ్యాడు. దేవరబెట్ట గ్రామానికి చెందిన దేవరబెట్ట తిమ్మగురు సివిల్ పోలీసుగా, దుద్ది గ్రామానికి చెందిన కురువ శేఖర్ సివిల్ పోలీసుగా, కోసిగి చెందిన రవిశంకర్ సివిల్ పోలీసులుగా ఎంపికయ్యారు. జంపాపురానికి చెందిన బుడ్డేగారి బసప్ప, శారదమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు. వీరిలో రెండో కుమార్తె శైలజ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. అలాగే ఏపీఎస్పీకి కోసిగి చెందిన చిన్న తాయన్న, బవనాసి సత్యరాజ్, చింతలగేని రాజశేఖర్, సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన మహాలింగ, వందగల్లు గ్రామానికి చెందిన ఆరగోళ్ల రాజశేఖర్, జంపాపురం గ్రామానికి చెందిన ఉస్మాన్ గని, ఎస్.ఉమాశంకర్, ఆర్లబండ గ్రామానికి చెందిన దాసరి బసవరాజు అర్హత సాధించారు.



బుడ్డేగారి శైలజ



హనుమంత రెడ్డి



కూల్‌డ్రింక్స్ అమ్ముతూ కానిస్టేబుల్..

హొళగుంద, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన రహంతుల్లా తండ్రితో పాటు కూల్‌డ్రింక్స్ అమ్ముకుంటూ కష్టపడి చదివి కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించాడు. తండ్రి సోడావలితో కలసి ఉదయం షాపులో పనిచేస్తూ తెల్లవారుజామున, రాత్రివేళల్లో కష్టపడి చదివినట్లు రహంతుల్లా తెలిపాడు.

ఒకే ఇంట్లో అన్నదమ్ములు

ఎమ్మిగనూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని ఎర్రకోట గ్రామంలో ఆరుగురు ఎంపిక కాగా ఒకే ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు ఎంపికయ్యారు. పూల వ్యాపారం చేసుకునే ప్రభు, వరలక్ష్మీ దంపతుల కుమారులు నాగేష్, శివశంకర్‌లు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.



ఆటో డ్రైవర్ కుమార్తె కానిస్టేబుల్

ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నల్లన్న కుమార్తె రేణుక మహిళా కానిస్టేబుల్‌గా ఎంపికైంది. దీంతో ఆ నిరుపేద కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

●ఎమ్మిగనూరు పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ టీ స్టాల్ నడుపుతూ జీవనం సాగిస్తున్న లింగం కుమారుడు శివ తండ్రికి టీస్టాల్ నడపటంలో చేదోడు వాదోడుగా పోలీసు సెలక్షన్స్‌లో సత్తాచాటాడు. కానిస్టేబుల్‌గా ఎంపికై తల్లిదండ్రుల కలను సాకారం చేశారు.



శివ



బాలుడి ఆచూకీ లభ్యం

● స్నేహితుడి సాయంతో కొడుకును దాచిపెట్టిన తల్లి

● 24 గంటల్లోనే అదృశ్యం కేసు ఛేదించిన పోలీసులు

కర్నూలు క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీపురం గ్రామంలో అదృశ్యమైన మోక్షిత్ ఆచూకీ ఎట్టకేలకు లభ్యమైంది. తల్లే తన స్నేహితుడి సాయంతో కొడుకును దాచిపెట్టి హైడ్రామాకు తెరతీసింది. తన చెల్లెలిపైనే నేరారోపణ చేసి పోలీసులను సైతం బోల్తా కొట్టింది. 24 గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ, నాగులాపురం ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డితో కలిసి డీఎస్పీ శుక్రవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం తన కొడుకు మోక్షిత్ ఇంటి నుంచి స్కూలు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తండ్రి సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరోవైపు తల్లి కూడా బంధువులతో వచ్చి పోలీస్‌స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేసింది. పోలీసులు చర్యలు తీసుకోవాలని తమ కొడుకును రక్షించాలని శోకాలు పెట్టింది. దీంతో ఆశ్చర్యానికి గురైన పోలీసులు తమదైన శైలిలో విచారిస్తే తల్లినే అసలు సూత్రధారి అని తేలింది.

స్నేహితుడితో కలిసి డ్రామా

సురేష్, తన బార్య విజయలక్ష్మితో కలిసి స్కందలో నివాసం ఉంటున్నారు. విజయలక్ష్మి స్నేహితుడు వెల్దుర్తి మండలం మల్లెపల్లె చెందిన మనోహర్‌నాయుడు అనేవ్యక్తి వీరి ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. విజయలక్ష్మి తన స్నేహితుడు మనోహర్ నాయుడుతో కలిసి ఈ డ్రామా నడిపినట్లు పోలీసులు గుర్తించారు. విజయలక్ష్మికి తన సొంత చెల్లెలి మధ్య కుటుంబ, ఆర్థిక సమస్యలు కారణంగా ఎలాగైనా వారిని భయపెట్టి డబ్బులు రాబట్టాలని పథకం పన్నింది. ఈవిషయాన్ని మనోహర్ నాయుడుకు తెలిపింది. అతడు గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్తున్న మోక్షిత్ వద్దకు వెళ్లి మాయమాటలు చెప్పి తనతో పాటు తీసుకెళ్లాడు. కంబలపాడు గ్రామంలో తనకు తెలిసిన వారి ఇంట్లో ఆ బాలుడిని ఉంచి మళ్లీ వస్తానని చెప్పి వచ్చేశాడు. ఆ తర్వాత విజయలక్ష్మితో కలిసి డ్రామా మొదలుపెట్టారు. ఏమీ తెలియని బాలుడి తండ్రి సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విజయలక్ష్మి కూడా తన సొంత చెల్లెలిపైనే ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించింది. తీరా డ్రామా బయటపడటంతో మనోహర్ నాయుడును అదుపులోకి తీసుకుని బాలుడిని సురక్షితంగా తండ్రి సురేష్ వద్దకు చేర్చారు. మనోహర్‌నాయుడును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నామని, తల్లి పాత్రపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

బుక్ కీపర్ పోస్టు కోసం బాహాబాహీ

● కూటమి నాయకులపై కేసు నమోదు

ఆదోని రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బుక్‌కీపర్ పోస్టు కోసం కూటమి నాయకులు బాహాబాహీకి దిగినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం సంతేకుడ్లూరు బుక్ కీపర్‌గా వైసీపీ నాయకుడి భార్య గాయత్రీ కొనసాగుతోంది. ఈ మధ్యకాలంలో ఆమె కుటుంబం బీజేపీలో చేరింది. కూటమి నాయకులు సువార్తమ్మను బుక్ కీపర్‌గా నియమించారు. దీంతో సువార్తమ్మ, గాయత్రి కుటుంబ మధ్య వైర్యం ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం కొత్తగా నియమితులైన సువార్తమ్మ వారి బంధువులు గాయత్రి ఇంటికెళ్లి ఘర్షణకు దిగారు. దీంతో ఇరు కుటుంబ సభ్యులు బుక్ కీపర్ మా వాళ్లంటే మావాళ్లే అని వాదనకు దిగి చివరకు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. స్థానికులు సమాచారం మేరకు ఇస్వీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు 10మందిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.



వివరాలను సేకరిస్తున్న పోలీసులు

ఇంట్లో చోరీ

● జత కమ్మలు, టీవీ, రూ.10 వేలు అపహరణ

నంద్యాల టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారుల్లోని వృద్ధురాలు సాలాది ప్రేమక్క ఇంట్లో గురువారం రాత్రి దొంగతనం జరిగినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. వివరాలివీ.., ప్రేమక్క పించన్ కోసం ఇల్లూరి కొత్తపేటకు వెళ్లారు. అయితే ఇంట్లోని జత కమ్మలు, టీవీ, రూ.10 వేలు నగదు దొంగతనం చేసినట్లు ఆమె ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

వడ్డీ వ్యాపారిపై కొరడా

● సెర్చ్ వారెంట్‌తో ఇంటిపై పోలీసుల దాడులు

● రికార్డులు స్వాధీనం

● బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

ఆదోని, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. సెర్చ్ వారెంట్‌తో త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తన సిబ్బందితో కలిసి వ్యాపారి ఇంటిపై దాడులు నిర్వహించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో వడ్డీ వ్యాపారానికి సంబంధించిన రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామలింగయ్య తెలిపారు. వివరాలు.. ఆదోని పట్టణంలోని సాయిబాబానగర్‌కు చెందిన బసవరాజు అనే రైతు అత్యవసర పరిస్థితుల కారణంగా తనకున్న మూడెకరాల పొలాన్ని వైఎంకే నగర్ కాలనీకి చెందిన సురేష్ శివలాల్ దగ్గర మార్టిగేజ్ చేసి 2019లో రూ.1.80 కోట్ల నగదును తీసుకున్నాడు. ఆరు నెలల క్రితం వడ్డీ వ్యాపారి సురేష్ శివలాల్ మృతిచెందారు. పొలం పెట్టి తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు బసవరాజు శివలాల్ కుమారుడు యోగేష్ దగ్గరికి రైతు వెళ్లాడు. తాకట్టు పెట్టలేదని, అంతా రిజిస్ట్రేషన్ ఉందని యోగేష్ వివరించాడు. తాను తన పొలాన్ని అవసరాల నిమిత్తం తాకట్టు పెట్టానే తప్ప రిజిస్ట్రేషన్ చేయలేదని బసవరాజు ప్రాధేయపడ్డాడు. బాధితుడు బసవరాజు తమకు ఇవ్వాల్సిన మొత్తాన్ని ఇస్తే తిరిగి రిజిస్ట్రేషన్ చేయించడానికి తాము సిద్ధంగా ఉన్నామని పోలీసుల ఎదుట యోగేష్ ఒప్పుకున్నారు. వడ్డీ వ్యాపారానికి సంబంధించిన రికార్డులను తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తామని సీఐ రామలింగమయ్య తెలిపారు.

బసవరాజు ఫిర్యాదుతో...

రైతు బసవరాజు పొలాన్ని సురేష్‌శివలాల్ మార్టిగేజ్ కాకుండా తమ కుటుంబ సభ్యులపై సేల్‌డీడ్ చేయించుకున్నారు. తాకట్టు కింద మార్టిగేజ్ చేశానే తప్ప సేల్‌డీడ్ చేసుకున్నాడని, తనకు ఈ విషయం తెలియదని బసవరాజు 2025 జూన్ 3వ తేదీన త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బసవరాజు ఫిర్యాదు మేరకు సురేష్ శివలాల్ కుమారుడు యోగేష్‌తో పాటు వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సెర్చ్ వారెంట్‌తో శుక్రవారం వైఎంకే నగర్ కాలనీలో నివాసముంటున్న యోగేష్ ఇంటికి వెళ్లి ఎలాంటి అనుమతులు లేకుండా ఫైనాన్స్ ఎలా ఇస్తున్నారంటూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి దగ్గర ఉన్న వడ్డీ వ్యాపారానికి సంబంధించిన రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు. తమకు ఏమీ తెలియదని తన తండ్రి సురేష్ శివలాల్ మాపై రిజిస్ట్రేషన్ చేయించాడని, అంతవరకు తనకు తెలుసు అన్నారు. ఎవరినీ వేధింపులకు గురిచేయలేదని, అలాంటి కుటుంబం కూడా కాదని పోలీసులకు వివరించారు.



సురేష్ శివలాల్ ఇంట్లో రికార్డులను పరిశీలిస్తున్న త్రీటౌన్ సీఐ రామలింగమయ్య

అటవీ అధికారులకు నెమలి అప్పగింత

గడివేముల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అధికారులకు గడివేముల ఎస్ఐ నాగార్జునరెడ్డి శుక్రవారం నెమలిని అప్పగించారు. ఎర్రమల కొండల్లో నుంచి మండలంలోని గడిగరేవుల గ్రామంలోకి వచ్చి నెమలి సంచరిస్తుండటంతో స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి నెమలిని ఫారెస్టు బీట్ ఆఫీసర్ కలామ్‌కు అప్పగించారు. ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి గని రేంజి ఫారెస్టులో వదిలిపెట్టారు.



నెమలిని అటవీ అధికారులకు అప్పగిస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న పాణ్యం మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గీత

పాణ్యం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత చొరవతోనే పాణ్యం వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి కృషి చేస్తున్నట్లు యార్డు చైర్‌పర్సన్ గీత తెలిపారు. పాణ్యంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శి రెహమాన్ ఆధ్వర్యంలో యార్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యార్డు అభివృద్ధికి రూ.83 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో యార్డు కార్యాలయ భవనానికి రూ.53 లక్షలు, తాగునీటి వసతికి రూ.10 లక్షలు, విద్యుత్ ఆధునికీకరణకు రూ.10 లక్షలు, రెండు గోదాముల మరమ్మతులకు రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వచ్చే రబీ నాటికి పనులు పూర్తి చేసి రైతులకు వినియోగిస్తామన్నారు. వీటితో పాటు యార్డులో సీసీ రహదారులు, షాపింగ్ కాంప్లెక్స్ తదితర పనులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. యార్డులో నిర్మాణ దశలో నిలిచిన గోదాము నిర్మాణం త్వరలో పూర్తయ్యేలా చర్యలు చేపతామన్నారు. యార్డు వైస్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు అంగజాల కృష్ణ యాదవ్, రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసయాదవ్, శివశంకరరెడ్డి, కేశవ, యార్డు సభ్యులు పాల్గొన్నారు.

పీఎం జీవన్ జ్యోతి బీమా చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న స్టేట్ బ్యాంకు మేనేజర్

పాణ్యం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాణ్యం, తమ్మరాజుపల్లె గ్రామాలకు చెందిన రెండు కుటుంబాలకు పాణ్యం స్టేట్ బ్యాంకు అధికారులు శుక్రవారం పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన చెక్కులు పంపిణీ చేశారు. ఇటీవల మృతి చెందిన పాణ్యానికి చెందిన చాకలి తులసి కుటుంబానికి రూ.2 లక్షలు, తమ్మరాజుపల్లెకు చెందిన మంగలి శ్రీనివాసులు కుటుంబానికి రూ. 2 లక్షల చెక్కులను పాణ్యం బ్రాంచ్ మేనేజరు అంజన్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సర్వీస్ మేనేజరు చంద్రసేనుడు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మహానందిలో సినీ నటుడు వేపూర్ కృష్ణ



మహానంది, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సినీ, టీవీ నటుడు వేపూర్ కృష్ణ శుక్రవారం మిత్రులతో మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు నాలుగు చిత్రాల్లో వివిధ పాత్రలు పోషించినట్లు చెప్పారు. అలాగే 10 టీవీ సీరియల్స్‌లో నటించినట్లు తెలిపారు. జీవితాంతం తెలుగు కళారంగంలో ఉంటానని చెప్పారు.

వంశపారంపర్య ధర్మకర్త నియామకంపై విచారణ


కృష్ణనందిలో విచారణ చేస్తున్న డీసీ గురుప్రసాద్

బండిఆత్మకూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నవనందుల్లో ఒకటైన కృష్ణనంది క్షేత్రం వంశపారంపర్య ధర్మకర్త విషయంపై దేవదాయశాఖ కర్నూలు డిప్యూటీ కమిషనర్ పి.గురుప్రసాద్ విచారణ చేశారు. శుక్రవారం ఆయన క్షేత్రానికి చేరుకుని పలు గ్రామాల పెద్దలు, క్షేత్రంలోని పలు సత్రాల నిర్వాహకులతో చిట్టిబొట్ల భరద్వాజశర్మ వంశపారంపర్య ధర్మకర్త నియామక నిమిత్తం ఉన్నతాధికారుల ఆదేశానుసారం డిప్యూటీ కమిషనర్ పలువురిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 4వతేదీ లోగా ఎవరైనా లిఖిత పూర్వక అభిప్రాయాలు డీసీ, ఈవో కార్యాలయాల్లో అందజేయవచ్చని, తదుపరి విచారణ పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, చైర్మన్ తిరుపంరెడ్డి, భరద్వాజ శర్మ, ఈవోలు వేణునాథరెడ్డి, రామాంజనేయశర్మ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల పరిశీలన


పగిడ్యాల పీహెచ్‌సీలో రికార్డును పరిశీస్తున్న అధికారులు

పగిడ్యాల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సుదర్శన్‌బాబు, అడిషనల్ డీఎంహెచ్‌వో శారదబాయి, లక్ష్మీప్రసన్న, రవీంద్రనాయక్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అనతరం బీరవోలు గ్రామంలో గర్భిణి వాణి మృతికి గల కారణాలపై వైద్యాధికారి కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు.

● ప్రాతకోట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్‌వో శారదాబాయి శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యశాలలోని సిబ్బంది, ఓపీ వివరాలను వైద్యాధికారి పూజరాణిని అడిగి తెలుసుకొని పలు రికార్డులను పరిశీలించారు.

శ్రీశైలంలో విశేష పూజలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో లోక కళ్యాణార్థం గ్రామదేవత అయిన అంకాలమ్మకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి ఎదురుగా కుడివైపు ఉత్తరముఖంగా వున్న అంకాలమ్మ అమ్మవారికి అభిషేకం, విశేష అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపారు.

● నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కర్నూలు రవిప్రసాద్ రాజు చే హరికథాగానం నిర్వహించారు. దక్షిణ మాడ వీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుంచి కార్యక్రమం ఏర్పాటు చేశారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

● వారోత్సవాల్లో అధికారులు


నంద్యాలలో మాట్లాడుతున్న సీడీపీవో చంద్రకళ

నంద్యాల రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో టీఎంఆర్ చంద్రకళ అన్నారు. నంద్యాల ఉప్పరిపేటలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. సీడీపీవో మాట్లాడుతూ తల్లిపాలు శ్రేష్టమని, వీటిని తాగడం వల్ల బాలలకు ఎలాంటి ప్రాణాంతక వ్యాధులు దరిచేరవని చెప్పారు.


నందికొట్కూరులో మానవహారంలో పాల్గొన్న సిబ్బంది

కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సుజాత, త్రివేణి, కుమారి, కళావతి, ఆరోగ్యమ్మ, శివకుమారి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ పోషకాహార మని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. పట్టణంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ సీడీపీవో మంగవల్లి ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జైకిసాన్ పార్కులో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అపోహలు, ఉద్యోగ అవసరాలు, ఇతరత్రా కారణాలతో చాలా మంది తల్లులు బిడ్డలకు పోతపాలు పడుతున్నారన్నారు. అలా కాకుండా ప్రతి తల్లి తన పాలను పుట్టిన అరగంటలోపే బిడ్డకు పట్టాలని ఆమె సూచించారు.

పింఛన్లు పెంచిన ఘనత చంద్రబాబుదే

● పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు


అయ్యలూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, పార్టీ పరిశీలకుడు ఆలం నరసానాయుడు

నంద్యాల రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పింఛన్లు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందని మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, పార్టీ రాష్ట్ర పరిశీలకుడు, టీడీపీ అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు అన్నారు.


అల్లూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి

నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జి, మాజీ సర్పంచ్ త్రిలింగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో మాట్లాడారు. లబ్ధిదారుల కళ్లల్లో చాలా ఆనందం చూశామన్నారు. టీడీపీ నాయకులు కె.ప్రతాప్‌రెడ్డి, రాయపురెడ్డి, హుస్సేన్‌వలి, వీరభద్రుడు, సర్పంచ్ ఓబులేసు, మాజీ సర్పంచ్ శ్రీను, టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చాబోలు ఇలియాస్ పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోంటోందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శుక్రవారం ఇంటివద్దకే వెళ్లి ఎన్‌టీఆర్ భరోసా ద్వారా మంజూరైన స్పౌజ్ పెన్షన్లను ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర సురేంద్రనాథరెడ్డి పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే


జానాలగూడెంలో ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న మహిళలు

కొత్తపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని అధికారులు, నాయకులతో కలిసి పర్యటించారు. ముందుగా మండల కేంద్రమైన కొత్తపల్లిలో నూతనంగా మంజూరైన కొత్త, పాత పించన్లను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం సంగమేశ్వరం-జానాలగూడెం బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. జానాల, బలపాలతిప్ప గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు లేక పిల్లలు అడవిబాట పడుతున్నారని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఐటీడీఏ అధికారులతో చర్చించి త్వరలోనే ఈ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇచ్చారు. నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, డైరెక్టర్ రాధాకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్ యాదవ్, లక్ష్మీదేవి, నాయకులు నారపురెడ్డి, లింగస్వామి గౌడు, మహేశ్వరరెడ్డి, మల్లారెడ్డి, లింగన్న, చంద్రారెడ్డి, అమర్, నారాయణ, రహీంఖాన్, మోహన్, రామకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

● ఎర్రమఠం పీహెచ్‌సీని ఎమ్మెల్యే జయసూర్య తనిఖీ చేశారు. ముందుగా ఆయన రికార్డులను పరిశీలించారు. అక్కడి వైద్యాధికారి జుబేర్ గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేరే చోట పనిచేస్తున్న వారికి డిప్యుటేషన్ రద్దు చేసి ఈ నెల 5వ తేదీలోపు ఎర్రమఠం పీహెచ్‌సీలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు సూచిం చారు. వైద్యశాల అపరిశుభ్రతగా ఉండడంతో అక్కడి సిబ్బందిపై మండిపడ్డారు.

మల్లన్న సన్నిధిలో రాజస్థాన్ మంత్రి


మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామిని రాజస్థాన్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ గ్రౌండ్ వాటర్ శాఖ మంత్రి కన్హియాలాల్ చౌదరి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ గోపురం వద్దకు చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచన మండంలో ఆలయ అధికారులు, వేదపండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

'ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు విఘాతం'

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారులు ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు విఘాతం కల్గించేలా నిర్ణయాలు తీసుకోవడం దారుణమంటూ పీఆర్‌టీయూ, ఏపీయూఎస్ నాయకులు దుయ్యబట్టారు. శుక్రవారం పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి పెన్‌డౌన్ పాటిస్తూ నిరసన వ్యక్తం చేసిన అనంతరం డీఈవో జనార్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇరు సంఘాల నాయకులు రామపక్కీరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, విజయరావు, మాధవరెడ్డిలు మాట్లాడుతూ ఎంఈవో-1 పోస్టులను ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసుకు విరుద్ధంగా కేవలం ప్రభుత్వ మేనేజ్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సర్వీసులో సీనియర్ అయినప్పటికీ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించకపోవడం ఆందోళన కల్గిస్తోందన్నారు. ఒకే డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు కామన్ సీనియారిటీ ప్రాతిపదికన మండల విద్యాధికారులుగా నియమకాలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. నాయకులు రఘు, దస్తగిరి, కరీముల్లా, విశ్వనాధరెడ్డి, సంపత్‌కుమార్, ప్రేమ్‌కాంత్, ఖాజా, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఉమ్మడి సీనియారిటీ ప్రకారం ఎంఈవో-1 పోస్టులను భర్తీ చేయాలని పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆయా మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పీఆర్‌టీయు, ఆపస్ సంఘాల ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ నాయకులు సయ్యద్ ఇబ్రహీం, రామిరెడ్డి, దామరేకుల రవి, నూర్‌మహ్మద్, చంద్రశేఖర్ ఉన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బుడ్డా


మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని ఉండవల్లిలో గల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీశైలం మండలంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ బీసీ హాస్టల్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలో హాస్టల్, భోజనశాల, తరగతులను మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే మౌలిక వసతుల కల్పన, అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి సదుపాయాన్నీ కల్పించాలని అన్నారు. అదేవిధంగా శ్రీశైలం నియోజకవర్గంలో చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని గుర్తుచేశారు. ప్రత్యేకించి చెంచు కుటుంబాలకు పక్కా గృహాలు నిర్మించాలన్న అంశాన్ని ప్రస్తావించారు. ఆయా అంశాలపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బుడ్డా వెల్లడించారు. ఆయన వెంట నియోజకవర్గ టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి ఉన్నారు.

టీవోటీలకు శిక్షణ

నంద్యాల టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల డ్వామా కార్యాలయంలో శుక్రవారం టీవోటీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు డ్వామా పీడీ సూర్యనారాయణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో డ్వామా, నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పీడీ మాట్లాడుతూ ఎన్ఆర్ ఈజీఏ నూతన అప్లికేషనన్లు, ట్యాగింగ్, సీవో ట్యాగింగ్, ఈకేవైసీ అనే అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈసీలు, టీఏలు, బాష్కర్‌రెడ్డి, రామవేశ్వరరెడ్డి, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

వనరుల గణనపై..

పాములపాడు: ఏడవ చిన్న తరహా నీటి వనరుల గణన, రెండవ జలాశయాల వనరుల గణనపై తహసీల్దార్ సుభద్రమ్మ, ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ ఉప గణాంకాధికారి నాగరాజు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం పాములపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు శివన్న, సామేలు, రాముడు, వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ హుస్సేన్, పురందేశ్వరుడు, ముర్తుజావలి, మద్దిలేటి, శ్రీనివాసులు, మహబూబ్‌బాషాకు గణనపై సలహాలు సూచనలను తెలియజేశారు. అనంతరం గ్రామ శివార్లలోని కొన్ని బావులను, బోర్లను గణన చేశారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక

మహానంది, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అబ్బీపురం గ్రామానికి చెందిన రైతు చాకలి వెంకటరమణ, రమణమ్మ దంపతుల కుమారుడు దుర్గాప్రసాద్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 147 మార్కులను దుర్గాప్రసాద్ సాధించి ఎంపికయ్యారు. వ్యవసాయ కుటంబం నుంచి ఎంపికైన యువకుడిని పలువురు అభినందించారు.

వెలుగోడు/పాములపాడు: ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో వెలుగోడుకు చెందిన ఇరువురు యువకులు ప్రతిభ కనబరచి సత్తా చాటారు. వెలుగోడు పట్టణంలో జమ్మినగర్‌కు చెందిన కొడావత్ సాయికుమార్ నాయక్, అలాగే దూదేకుల బాదుల్లా ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. పాములపాడుకు చెందిన వెంకటక్రిష్ణ, బుద్దానగర్‌కు చెందిన నరేంద్రలు ఎంపికయ్యారు.

గడివేముల: మండలంలోని నలుగురు యువకులు ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. గడిగరేవుల గ్రామానికి చెందిన రవింద్రయాదవ్ 121 మార్కులు, అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ 138 మార్కులు, పెసరవాయి గ్రామానికి చెందిన రమేష్‌బాబు 118 మార్కులు, బిలకలగూడురు గ్రామానికి చెందిన కాటపోగు ఈశ్వరి 108 మార్కులు సాధించారు. కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిని తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

ఆత్మకూరు: కానిస్టేబుల్స్ పరీక్షా ఫలితాల్లో ఉద్యోగాలు దక్కించుకున్న నలుగురు అభ్యర్థులు అర్బన్ సీఐ రామును స్థానిక పోలీసుస్టేషన్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సీఐ మాట్లాడుతూ ఎస్పీ, ఆత్మకూరు డీఎస్పీ సూచనల మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యర్థుల సౌకర్యార్థం పోలీసుశాఖ తరుపున 400 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ ట్రాక్‌లను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్లు దేవానంద్, శంకర్‌తో పాటు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ వారి సహకారంతో వారికి కోచింగ్ ఇచ్చామని అన్నారు. అయితే ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో ఈ ప్రాంతం నుంచి 70 మంది అభ్యర్థులు ఎంపిక కాగా వారిలో ఇద్దరు యువకులకు, ఇద్దరు యువతులకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రత్యేకించి రఫీక్ (ఆత్మకూరు), ధర్మానాయక్ (నల్లకాల్వ), శ్రీలత (కరివేన), మలిరెడ్డి ఓబులమ్మ (దుద్యాల) వారికి ఉద్యోగులు రావడం తనకు కూడా ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కాగా తమకు పోలీసు ఉద్యోగాలు వచ్చేందుకు సహకరించిన సీఐ రామును వారు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ నారాయణరెడ్డి ఉన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా 'మధ్యాహ్న భోజనం' అమలు

● మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి

నందికొట్కూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారం రూ.4.10 లక్షలతో విద్యార్థులు భోజనం చేసేందుకు నిర్మించిన భోజనశాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. బైరెడ్డి విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో దాతల సహకారంతో ఇలాంటి భోజనశాల ఏర్పాటు చేస్తే పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులు భోజనం చేసి, ఆరోగ్యంగా ఉంటారన్నారు. దాత ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, దాత, కౌన్సిలర్ చాంద్‌బాషా, దక్షిణ మధ్య రైల్వే జోనల్ వినియోగదారుల కన్సల్టేట్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, కట్టుబడి శ్రీనివాసులు, గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని 24వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నందికొట్కూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాలలో శుక్రవారం సీపీఎం కార్యకర్తల సమావేశం గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చిన్నచిన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ.20, రూ.30 కోట్లను కేటాయించలేని ప్రభుత్వం రూ.81 వేల కోట్లతో గోదావరి జలాలను బనకచర్ల తరలించి రాయలసీమను శస్యశ్యామలం చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.10 వేల కోట్లు కేటాయిస్తే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి అవుతాయన్నారు. గోదావరి నీటిని బనకచర్లకు తీసుకురావడం పట్ల తాము వ్యతిరేకం కాదన్నారు. తక్కువ ఖర్చుతో సీమలోని చిన్నచిన్న ప్రాజెక్టులు పూర్తి అవుతాయని, ముందుగా వాటిపై దృష్టి సారించాలన్నారు. రూ.1670 కోట్లతో వేదవతి రిజర్వాయర్‌ను నిర్మించేందుకు 2018లో చంద్రబాబు హయాంలో శంకుస్థాపన చేశారని, అయితే గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం కూడా పట్టించుకోలేదని అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని అలగనూరు, మిడ్తూరు ఎత్తిపోతల పథకాల ప్రాజెక్టులకు పూర్తి చేస్తామని చెప్పడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. నిధులు కేటాయిస్తూ జీవోలను విడుదల చేయడంతో పాటు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి నిర్దిష్ట సమయంలోగా పనులను పూర్తి చేసి పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, నాయకులు పక్కీర్ సాహెబ్, రాజు, కర్ణ, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రంగమ్మ, ఓబులేసు, ఈశ్వరమ్మ, పాల్గొన్నారు.

క్లినిక్ తనిఖీ


క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అబార్షన్ చేయడంతో గర్భిణి చనిపోయిందని ఫిర్యాదు అందడంతో పట్టణంలో అబార్షన్ ఆర్ఎంపీ గీతారాణి నిర్వహిస్తున్న క్లినిక్‌ను నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ఓబులేసు తనిఖీ చేశారు. వాణి తల్లి శివమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం సీఐ పాతబస్టాండ్‌లోని మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న చిన్న గల్లీలో మొదటి అంతస్తులో ఉన్న గీతారాణి కినిక్‌ను ఆయన పరిశీలించేందుకు వెళ్లారు. అక్కడి వెళ్లాక క్లినిక్ గేటుకు తాళం వేసి ఉండడంతో ఆర్ఎంపీ గీతారాణికి ఫోన్ చేసినా స్విచ్‌ఆఫ్ రావడంతో తాళం పగలగొట్టి క్లినిక్‌ను తనిఖీ చేశారు,

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నాగరాజు, గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణలో ఆ సంఘం నాయకులు నాయక్, రాజా, దినేష్, హరివర్ధన్, సాయి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. బేతంచెర్ల నుంచి నంద్యాలకు వెళ్తున్న మోటారు సైకిల్‌ను ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో బేతంచెర్లకు చెందిన సలీంబాషా, బాలిక అస్రాకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వీరిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు బురదమయం


పద్మావతి నగర్‌లో బురదమయంగా మారిన రహదారి

నంద్యాల టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి నగర్‌లో బ్రిడ్జి కింద రోడ్డు బురదమయంగా మారింది. ప్రధాన రోడ్డు పనులు జరుగుతున్నాయి. అయితే రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్లకు, దుకాణాలకు, ఆనుకుని ఉన్న దారులకు ప్రత్యామ్నాంగా ఎటువంటి దారి చూపకపోవడంతో సుమారు 60 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. అంతేకాకుండా వర్షకాలం కావడంతో ఉన్న దారులు కూడా బురదమయంగా మరాయి. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.25 కోట్లతో అహోబిలం అభివృద్ధి



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఆళ్లగడ్డ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్ర మైన అహోబిలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 25 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. శనివారం ఈ పనులకు సంబంధించి జమ్మలమడుగు మండలం గండికోటలో ముఖ్యమంత్రి శిలాఫలకాన్ని ప్రారంభించారన్నారు. అహోబిలం అభివృద్ధి కోసం స్వదేశీ దర్శన్ పథకం కింద ఈ నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దిగువ అహోబిలంతోపాటు ఎగువ అహోబిలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారన్నారు.

వైభవంగా స్వాతి సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో సుదర్శనహోమం నిర్వహించారు. అలాగే నవనరసింహ సన్నిధిలకు భక్తులు నడిచి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు దేవస్థానం, సత్రాల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఆభరణాల విరాళం

డోన్ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణం కొండపేటకు చెందిన జి.భాస్కర్‌గౌడు, అరన్ జ్యోతి మనుమరాలు జీఈ దేవి నందిత జన్మదినం సందర్భంగా అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.1.50 లక్షలు విలువ చేసే ఆభరణాలు సమర్పించారు. అలాగే డోన్ పట్టణ శివారులోని సాయిబాబా ఆలయానికి రూ.43వేలు విలువ చేసే వెండి కంచెం విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జీఈ నవీన్‌సింహ, లక్ష్మి, శ్వేతా మృత, నందన్‌సింహ, వైష్ణవి దేవి, దేవి నందిత పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీంబాషా డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని కొండారెడ్డి స్మారక భవనంలో జిల్లా నాయకులు ఎం.సుధాకర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు నాగేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు, వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు దేవరాజు, బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఓబయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామచంద్రరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, నవీన్, ఆటో యూనియన్ నాయకులు రఘు, రైతు సంఘం నాయకులు సుబ్బారెడ్డి, కార్మిక సంఘం నాయకులు త్యాగరాజు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

రుద్రవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లి ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానమని వైద్యాధికారి బాబు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నరసాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పుట్టిన గంటలోపే తల్లిపాలు బిడ్డకు తాగించాలన్నారు. ముర్రుపాలు ఎంతో శక్తినిస్తాయన్నారు. ముర్రుపాలు తాపించడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతోందన్నారు. రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. నిరంతరం తల్లి దృశ్యసంరక్షణ బిడ్డ మానసిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రిలో ర్యాలీ..

చాగలమర్రి: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చాగలమర్రిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించం

- టీడీపీ సీనియర్ నాయకుడు మద్దిలేటి రెడ్డి



మాట్లాడుతున్న మద్దిలేటి రెడ్డి

సంజామల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అసత్య ఆరోపణలు చేస్తే సహించమని టీడీపీ సీనియర్ నాయకుడు మంచాల మద్దిలేటి రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆల్వకొండ విష్ణుశేఖర్ రెడ్డితో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గతనెల 31న ఆల్వకొండలో జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితోపాటు కొందరు చోటా నాయకులు ఆల్వకొండ అభివృద్ధి కాటసాని కాలంలో జరిగిందని ఊగదంపుడు ఉపన్యాసాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. 2014 - 2019లో తన సోదరుడు అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆల్వకొండ గ్రామాభివృద్ధికి రూ. 1.12కోట్లు వెచ్చించారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019 - 2024లో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామాభివృద్ధికి కేవలం రూ. 73లక్షలు మాత్రమే విడుదల చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి బీసీ ఏడాది కాలంలోనే గ్రామానికి రూ. 20లక్షలు సీసీ రోడ్డు వేయించడంతోపాటు మరో రూ. 14లక్షలు నిధులు అభివృద్ధి పనులకు విడుదల చేయించారన్నారు. అభివృద్ధి ఎవరు చేసింది ఎవరో బహిరంగ సభలో తేల్చుకుందామని ఆయన సవాలు విసిరారు. సమావేశంలో చిన్న శేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నాగరాజు, హుసేన్, మద్దిలేటి, మాధవ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళా పోస్టర్ ఆవిష్కరణ

డోన్ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న నిర్వహించనున్న ఉద్యోగ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ నిరుద్యోగాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ సహకారంతో ఈ ఉద్యోగ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థలు ఈ మేళాలో పాల్గొంటున్నాయని అనేక ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండనున్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అర్హత పత్రాలు, బయోడేటా, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మేళాలో పాల్గొనాలని కోరారు.

నత్తనడకన పనులు

- 2023లో ఎంపీడీవో కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ
- పనుల్లో తీవ్ర జాప్యం
- ఇరుకు గదుల్లోనే మండల పరిషత్ అధికారుల విధులు
- త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి



అసంపూర్తిగా ఉన్న మండల పరిషత్ భవన నిర్మాణ పనులు

డోన్ రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు రోడ్డులో మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందుకు రూ.కోటిన్నర నిధులు మంజూరు చేశారు. పాతభవనాన్ని పడగొట్టి నిర్మాణ పనులు మొదలు పెట్టడంతో మండల పరిషత్ అధికారులు, కార్యాలయం సిబ్బంది తాత్కాలికంగా కొత్తబస్టాండు రోడ్డులో ఉన్న పంచాయతీ కార్యాలయం భవనంలోకి తమ కార్యాలయాన్ని తరలించారు. ఇరుకు గదిలోనే విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటుకు మండల అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలోనే ఉన్న ప్రభుత్వ అతిథిగృహం వరండాలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు సంవత్సరాలు పైగా అవుతున్నా కూడా నూతన భవన నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. 80 శాతం పనులు పూర్తయినప్పటికీ భవన పైకప్పు షీట్లు వేసి లోపలి భాగం పనులు పూర్తి చేయాల్సి ఉంది. త్వరితగతిన ఆ పను లు పూర్తి చేసి నూతన కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని పలువురు కోరుతున్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



డోన్ కోర్టు రోడ్డులో నిర్మిస్తున్న మండల పరిషత్ కార్యాలయ నూతన భవన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. పనుల జాప్యం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటు అధికారులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిలిగిన పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

- మోటరాముడు, ఏపీ గిరిజన సమాఖ్య నాయకుడు, డోన్

పేదల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం



డోన్‌లో స్పౌజ్ పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



చింతకుంటలో పింఛన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

డోన్ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లును కమిషనర్ ప్రసాద్‌గౌడు, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పింఛన్‌దారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా పింఛన్లు ఒకటో తేదీనే అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే సాధ్యమన్నారు. అలాగే కమలాపురంలో సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి, దేవరబండలో సీనియర్ నాయకులు వెంకట నారాయణ గౌడు, ఆయా గ్రామాల్లో నాయకులు పంపిణీ చేశారు.

పార్టీలకు అతీతంగా పథకాలు

ఆళ్లగడ్డ: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం టీడీపీ అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ కండువా వేసుకున్న నాయకులకు సైతం తల్లికి వందనం డబ్బులు పడ్డాయంటే తమ ప్రభుత్వం ఏవిధంగా పని చేస్తోందో అర్థమవుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సొంతూరిలో కూడా రూ. 1.40కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. తమకు ప్రజలంతా ఒక్కటే అని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కిశోర్, చింతకుంట టీడీపీ ఇన్‌చార్జి నాయకులు జాఫర్ రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లు శుక్రవారం టీడీపీ నాయకులు రోషన్ అహమ్మద్‌హుసేన్, అమీర్‌జాన్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే పాతపాడులో సర్పంచ్ మహేశ్వరరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు.

కొలిమిగుండ్ల: మండలంలో నూతనంగా వితంతువులకు మంజూరు అయిన పింఛన్లను శుక్రవారం టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కనకాద్రిపల్లె గ్రామంలో టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్‌లక్ష్మీరెడ్డి, సర్పంచ్ శివశంకర్, పెద్దిరెడ్డి, గోర్విమానుపల్లె గ్రామంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు పులి ప్రకాశ్‌రెడ్డి, పేట్నికోటలో మండల తెలుగు యువత అధ్యక్షులు హుస్సేన్‌రెడ్డి, సత్యం, కొలిమిగుండ్లలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, ఉపసర్పంచ్ నాగయ్య, ఆయాగ్రామాలో నాయకులు పంపిణీ చేశారు.

డోన్‌లో రైల్వే జీఎం తనిఖీ

డోన్ రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డోన్ రైల్వేస్టేషన్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ తనిఖీ చేశారు. డోన్ నుంచి కర్నూలు మీదుగా డబుల్ లైన్ రైల్వే ట్రాక్ పరిశీలన కోసం ప్రత్యేక రైలులో వచ్చిన ఆయన డోన్ రైల్వేస్టేషన్‌లో దిగారు. డోన్ రైల్వే స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు ఆయనకు స్వాగతం పలికారు. ప్లాట్‌ఫారం పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం డోన్-కర్నూలు మీదుగా వెళ్లే ట్రాక్‌ను పరిశీలించారు. డోన్ రైల్వేస్టేషన్ నుంచి కర్నూలు మీదుగా వెళ్లే లైన్‌లో భవిష్యత్తులో జరిగే రైల్వే డబుల్ ట్రాక్ లైన్ కోసం పరిశీలన నిమిత్తం ఆయన డోన్ రైల్వేస్టేషన్ మీదుగా ప్రత్యేక రైలులో వచ్చి అక్కడి నుంచి కాచిగూడకు వెళ్లిపోయారు.



పరిసరాలను పరిశీలిస్తున్న జీఎం సంజయ్‌కుమార్

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం



గూటుపల్లెలో రైతులకు డ్రోన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుటూపల్లె గ్రామంలో ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో రైతులకు రూ.10 లక్షల విలువైన డ్రోన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ సునీత, బేతంచర్ల ఏవో విజయకుమార్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో దస్తగిరిబాబు, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకులు పోలూరు రాఘవ రెడ్డి, సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు ఉన్నం చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, ఉన్నం చంద్రశేఖర్, భీమేశ్వరరెడ్డి, నాయకులు గూటుపల్లె ముల్లా, శేఖర్, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

● మండలంలోని గూటుపల్లె, హుశేనాపురం, నాగమల్లకుంట, రెహిమాన్‌పురం గ్రామాల్లో ఎమ్మెల్యే కోట్ల పింఛన్‌దారులకు పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొని టీడీపీ సం క్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అంతకు ముం దు ఎమ్మెల్యే కోట్లకు భారీ గజమాలతో స్వాగతం పలి కారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక:

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో తవిసికొండ సర్పంచ్ బండి కాటి లక్ష్మీదేవి భర్త బండికాటి వెంకటేశ్వరరెడ్డి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే కోట్ల టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మద్దూరు ప్రాథమిక పాఠశాల వద్ద ఉపాధ్యాయుల పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవో-1 పోస్టులను ప్రభుత్వ యాజమాన్య స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయడం అన్యాయమని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మౌలాలి పేర్కొన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ ఆవశ్యకతను, పెండింగ్ బకాయిలు, డీఏ, ఏరియర్స్‌ను, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా నాయకులు హరినాథ్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, షరిఫ్, సురేష్‌బాబు, రాజ్‌కుమార్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

అవుకు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలోని వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జూటూరు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం వాసవీమాతను గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, యువజన సంఘం అధ్యక్షుడు నాగేంద్రకుమార్, ఆర్యవైశ్య మహిళలు రాధాదేవి, రమాదేవి, శిరీష, మాధవి, ప్రసన్న, లక్ష్మీసులోచన, సుచరిత, స్వర్ణలత, లలిత, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



అవుకులో గాజులతో వాసవీమాత అలంకరణ

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి చీర, సారె, పండ్లు సమర్పించి పూజలు చేశారు. వెండిరథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి రథోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



చాలగమర్రిలో 'సామూహిక వడిబియ్యం' లో పాల్గొన్న మహిళలు

రుద్రవరం: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యాగంటి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ప్రసాదం అందుకుంటున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రాన్ని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా ఈవో పాండురంగారెడ్డి, పూజారులు, మౌళీ శ్వరరెడ్డి, తదితరులు బీసీ ఇందిరమ్మకు పూర్ణకుం భంతో స్వాగతం పలికారు. ఆలయంలోని నందీశ్వరుడికి, ఉమామహేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. బీసీ ఇందిరమ్మకు పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీసేవ



పల్లకిలో అమ్మవారు

బనగానపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజారు లు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించా రు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నందవరం ఆలయాభివృద్ధికి విరాళం

చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి దాతలు శుక్రవారం విరాళం ఇచ్చారు. కర్నూలుకు చెందిన తలారి లక్ష్మీనారాయణ, రమాదేవి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం రూ. 25వేలు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డికు అందజేశారు.

సీపీఐ జిల్లా కార్యవర్గం ఎన్నిక

డోన్ రూరల్/బేతంచెర్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా మోటరాముడు, న్యాయవాది భార్గవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం డోన్ పట్టణం గుత్తి రోడ్డు క్రిస్టియన్ హాలులో జరిగిన సీపీఐ జిల్లా ప్రతినిధుల సభలో 15 మంది జిల్లా కార్యవర్గ సభ్యులను జిల్లా రెండో మహాసభల ముగింపు సందర్భంగా ఎన్నుకున్నారు. మోటరాముడు ఎన్నికపై పార్టీ అనుబంధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

'అన్నదాత సుఖీభవ'కు 6,197మంది రైతులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 'అన్నదాత సుఖీభవ' పథకానికి 6197మంది రైతులు అర్హత సాధించినట్లు మండల వ్యవసాయ అధికారి నాగేంద్రప్రసాదు, ఏఈవో నాగరాజు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం శనివారం మండలంలోని రైతుల ఖాతాల్లో రూ.3.10కోట్లు జమ చేయనుందన్నారు.

నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో సుమతి

రుద్రవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాసిరకం ఎరువులు, మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో సుమతి హెచ్చరించారు. శుక్రవారం ఆలమూరు గ్రామంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయించాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఏఈవో రాజు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాలయం ముందు చదును



వ్యవసాయ కార్యాలయం ముందు మట్టి తొలగించి చదును

రుద్రవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ముందు చదును చేయించారు. జూలై 25న 'వ్యవసాయ కార్యాలయం ముందు చిత్తడి' అనే శీర్షికన కథనాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. దాంతో వ్యవసాయాధికారి సుమతి స్పందించారు. శుక్రవారం కార్యాలయం ముందు మట్టి తొలించి చదును చేయించారు. కార్యాలయం రంగులు వేయించారు. రైతుల రాకపోకలకు సౌకర్యంగా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు ఏవో తెలిపారు.

బోరుబావి నుంచి ఉబికిన నీరు



బోరుబావి నుంచి ఉబికి వస్తున్న నీరు

రుద్రవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం - ఎర్రగుడిదిన్నె రహదారిలో వ్యవసాయ బోరుబావి నుంచి నీరు ఉబికి వస్తోంది. మోటారు ఆన్ చేయకున్నా బోరుబావి నుంచి జలం పొంగి ప్రవహిస్తోంది. వేసవిలో బోరు బావిలో నీరు పుష్కలంగా ఉంటుందని రైతులు తెలిపారు.

కలశ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



పూజలో పాల్గొన్న దంపతులు

ఉయ్యాలవాడ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంజేడులో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రాజగోపుర కలశ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజులు పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. మొదటి రోజు ప్రధాన అర్చకుడు అనంతశర్మ ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, జలాధివాసం, అంకురార్పణము తదితర పూజల్లో దంపతులు పాల్గొన్నారు. అర్చకులు క్రిష్ణప్రసా ద్‌శర్మ, వరప్రసాద్, హరిశర్మ, శివప్రసాదు, రమణయ్య పా ల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బనగానపల్లె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన రాళ్లకొత్తూరు సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్యాపిలి మండలం సీతమ్మ తండాకు చెందిన నాగూనాయక్ బైక్‌పై రాళ్లకొత్తూరు మీదుగా పనిపై వెళ్తుండగా లారీ ఢీకొనింది. దాంతో నాగూనాయక్ కాలు విరిగిపోయింది. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బనగానపల్లె పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.